క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



కొల్లాబత్తుల రవికుమార్

మొగల్తూరు: రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొల్లాబత్తుల రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రంలో మన ఎంపీలు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నరసాపురం ఎమ్మెల్యేగా ముదునూరి ప్రసాదరాజు, ఎంపీగా గూడూరి ఉమాబాలలు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలంటే జగనన్నే విజయం సాధించాలని వివరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్యాన్సర్ రోగికి వసుధ సహాయం



గొల్లవానిచెరువులో క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు వల్లవానిపాలెంకి చెందిన క్యాన్సర్ రోగి కొక్కిరిగడ్డ జ్యోతికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, కె.జాన్ చేతుల మీదుగా రోగికి అందజేశారు.

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



వదలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయానికి విరాళం అందిస్తున్న దాతలు

పెనుగొండ: మండలంలోని వదలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి తూర్పు గోదావరి జిల్లా దుళ్లకు చెందిన యన్నమని వీర వెంకట కాశీ విశ్వేశ్వరరావు శ్రీవల్లి , సూర్యసత్యకార్తికేయకుటుంబ సభ్యులు రూ.10,121 విరాళం ఇచ్చినట్లు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని మరింతగా తీర్చిదిద్దడానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో ఉద్యోగి పాత్ర కీలకం



పంచాయతీ కార్యదర్శి సాత్వీకంను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

ఉండి: గ్రామాభివృద్ధిలో ఉద్యోగి పాత్ర కీలకమని చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సాత్వీకం ఇటీవలె చిలుకూరు నుండి బదిలీపై కాళ్ల మండలం కలవపూడి వెళ్లిన కార్యదర్శిని, జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిలుకూరు పంచాయతీ కార్యదర్శిగా గ్రామాభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజల ముందుకు సమస్య రాకముందే పంచాయతీ పాలకవర్గం దృష్టికి తెచ్చి పరిష్కరించేవారని కొనియాడారు. కార్యదర్శి సాత్వీకం మాట్లాడుతూ చిలుకూరు తనకు సొంత గ్రామంలా మారిపోయిందన్నారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లడం బాధాకరంగా వున్నా విధి నిర్వహణలో ఇవన్నీ తప్పనిసరి అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆమెను సత్కరించారు.

వేగంగా నరసాపురం పట్టణ సుందరీకరణ



రైల్వేస్టేషన్‌రోడ్డులో డివైడర్ల వద్ద అధ్వానంగా ఉన్న దృశ్యం (ఫైల్) (నాడు)



అదే ప్రాంతంలో నేడు అందంగా ఆధునికీకరించిన దృశ్యం (నేడు)

ప్రత్యేక దృష్టి పెట్టిన మునిసిపాలిటీ పాలకులు, అధికారులు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు దృష్టిపెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో సుందరీకరణ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిచ్చేవి. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడీ ప్లాట్‌పామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అవన్నీ శిథిలమయ్యాయి. ఇక రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డులో నిర్మించిన డివైడర్లు శిథిలమయ్యాయి.

సుందరీకరణపై ప్రత్యేక చర్యలు



పట్టణ సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాం. ముఖ్యంగా గోదావరిగట్టు పొడవునా అందంగా తీర్చిద్దిదానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉదయం,సాయంత్రం వేళల్లో గోదావరిగట్టు వద్దకు విహారం కోసం పెద్ద ఎత్తున జనం వస్తున్నారు. గట్టుపొడవునా ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలుచేపడతాం. పట్టణంలో ప్రధాన రహదారులను కూడా పునర్నిర్మిస్తున్నాం. కాటన్‌పార్కుకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది.

– బర్రి శీరవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

మారిన పరిస్థితి

ఇటీవల కాలంలో మున్సిపాలిటీ కాటన్‌పార్కును అభివృద్ధి చేసింది, అలాగే అలాగే ఏటిగట్టు పొడవునా సుందరీకరణ పనులు కూడా చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక రైల్వే స్టేషన్ రోడ్డులో వీధిదీపాలు ఆధునికీకరించారు. డివైడర్లను పూర్తిగా ఆధునికీకరించి అందంగా తయారు చేశారు. మిషన్ హైస్కూల్ రోడ్డులో కూడా డివైడర్లను ఆధునికీకరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం కొత్త అందాలను సంతరించుకుంది.

ఐద్వా రాష్ట్రస్థాయి విజ్ఞాన శిక్షణ తరగతులు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

నరసాపురం: మహిళల శ్రమ దోపిడీ అనేది నేటికీ మన దేశంలో కొనసాగుతుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి వివరించారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్రస్థాయి విజ్ఞాన శిక్షణ తరగతులు రెండవరోజుకు చేరాయి. ఆదివారం శిక్షణా తరుగతులను ఉద్దేశించి రమాదేవి మాట్లాడుతూ ప్రధాని మోదీ అవలంభిస్తున్న పెట్టుబడీదారి విధానాలు కారణంగా సమాజంలో మహిళలు ఎదగలేకపోతున్నారని అన్నారు. పలు కార్పొరేట్ శక్తుల చేతుల్లోని సంస్థలు కారుచౌకగా మహిళలతో పనులు చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. మహిళలు సంఘటితంగా ఈ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పురుషులతో సమానంగా సంపూర్ణ సమానత్వ సాధన కోసం మహిళలు ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్ ఉదయకుమారి, ఎస్ జయప్రభ, రాణి, శ్యామల, సీత, రోజామణి పాల్గొన్నారు.

ఘనంగా ధనకొండాలమ్మ జాతర



ధనకొండాలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు



దన కొండాలమ్మ

యలమంచిలి: అడవిపాలెం, మేడపాడు, పెనుమదం, కొంతేరు, అప్పనచెరువు గ్రామాల సరిహద్దులో పాలకొలను సర్వేశ లింగం పొలంలో వెలసిన ధ నకొండాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే ఈ జాతర జరుగుతుంది. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి కుంభం పోశారు. అనంతరం ఊయల ఉత్సవం చేసి అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. ఐదు గ్రామాలకు చెందిన రైతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరలో ఐదు గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో జాతరకు వచ్చిన సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

ప్రజాభిప్రాయం మేరకే ఎగ్జిట్ పోల్స్

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని ఎగ్జిట్ పోల్స్ ప్రజాభిప్రాయన్ని తేల్చి చెప్పాయని ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టరు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న వెల్లడయ్యే వాస్తవ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్న ధీమాను వ్యక్తం చేశారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో మహిళలను సమాజంలో ఆత్మగౌరవంతో నిలబెట్టారని, సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు కుటుంబాన్ని నడింపించగల శక్తిని మహిళలకు అందించారని పేర్కొన్నారు. సీఎం జగన్ వల్లే మేలు జరుగుతుందని మహిళలు విశ్వాసంతో పోలింగ్‌కు భారీగా తరలి వచ్చి ఓటు వేశారని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఉండి సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

ఉండి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉండి సెంటర్‌లో ఓట్ల లెక్కింపుపై మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ వెలువడనున్న ఎన్నికల ఫలితాల దృష్ట్యా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సిబ్బంది, ఏజెంట్లకు తప్ప ఇతరులు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. అలాగే కౌటింగ్ సమయంలో, ఫలితాలు వెలువడిన సందర్భంలో సంబరాలు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికలకు శాంతియుతంగా సహకరించిన అన్ని పార్టీల వారు కౌటింగ్ సమయంలోను సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీదే విజయం



తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలోనూ, ఆచంట నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు, ఆదివారం తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడుతూ 4న రాష్ట్ర ప్రజలు తీర్పు చెప్పబోతున్నారన్నారు. 155కుపైగా నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమానికి మహిళా ఓటర్లు సైలంట్‌గా ఓటుతో కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఎన్నికల్లో సీఎం జగన్ చేసిన మంచికి ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారన్నారు. దీనికి భిన్నంగా చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ ప్రచారం చేశారన్నారు. దుష్ప్రచారం, కుయుక్తులపైనే చంద్రబాబు, జనసేన నాయకులు నమ్మకం పెట్టుకున్నారన్నారు, వారి ప్రయత్నం విఫలమైందన్నారు. ఎందరూ కూడగట్టుకొని వచ్చినా సీఎం జగన్ విజయాన్ని ఆపలేకపోయారన్నారు. దీనికి ఉదాహరణ ప్రధాన సర్వేలన్నీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టబోతుందని తేల్చి చెప్పాయన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విజయం సాధించబోతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మద్దతు దారులు సైలెంట్‌గా ఉన్నారన్నారు. టీడీపీ అత్యుత్సాహం ప్రదర్శిస్తుందన్నారు. వారి నాటకాలు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఆచంట నియోజకవర్గంలోనూ అత్యంత మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. 9న సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు), నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు



జిన్నూరులో వృద్ధుడికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

పోడూరు: కిమ్స్, మెడ్‌యునైటెడ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జిన్నూరు గ్రామంలోని ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు సేవాసమితి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, ఎముకలకు సంబంధించిన రోగులకు, కంటి సమస్యలున్నవారికి శిబిరంలో ఆయా విభాగాల సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి గ్రామానికి చెందిన దాత పెన్మెత్స రమణప్రసాదరాజు సౌజన్యంతో ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో మొత్తం 180 మందికి పరీక్షలు నిర్వహించినట్లు అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులు తెలిపారు. పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో సేవలందించిన వైద్యులు, సిబ్బందిని, అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు దండు కృష్ణంరాజు, ఆచంట వెంకట సుబ్బారావు, దండు గోపాలం, సొసైటీ చైర్మన్ జక్కంశెట్టి అప్పాజీ, ఏఎస్ఎం కె.గౌరి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టం వర్తింపజేయాలి

ఆకివీడు: రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతన చట్టం , కార్మిక చట్టాల్ని వర్తింపజేయాలని రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీ.వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల్ని సవరించి పదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షులు జేఎస్వీ. గోపాలన్, మండల అధ్యక్షకార్యదర్శులు పెంకి అప్పారావు, తవిటినాయుడు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన పాటించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

ఆకివీడు: విద్యార్థులు సమయపాలన పాటిస్తే మంచి భవిష్యత్ చేకూరుతుందని లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మాదివాడలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 789 నెంబర్‌ను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ సంఖ్యల్ని కూడితే 24 వస్తుందని అవి గంటలుగా భావించి, 7 గంటలు విశ్రాంతి, నిద్రపోవాలని, 8 గంటలు విద్యపై దృష్టి పెట్టాలని, 9 గంటలు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, స్నేహితులతో మాట్లాడటం వంటి వాటిని అలవర్చుకోవాలన్నారు. 789 ఫార్ములాను పాటిస్తే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థితికి చేరి, దేశం గర్వించే పౌరులవుతారని తెలిపారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం ప్రతినిధులు, శిక్షకులు, గ్రంథాలయ నిర్వాహకురాలు పార్వతి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

కాళ్ల: మండలంలోని స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బండారు దుర్గాప్రసాద్ ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నైతిక విలువలు, విద్యాభివృద్ధికి దోహదం చేసే అంశాలు తెలియజేశారు. టైం మేనేజ్మెంట్ పరీక్షలకు ప్రత్యేక సదస్సు నిర్వహించి, మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కార్యాచరణ సమితి నాయకులు

రైతు కార్యాచరణ సమితి నాయకులు

భీమవరం: సార్వా వరిసాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మైనర్ డ్రెయిన్స్ మర్మతులపై దృష్టి పెట్టాలని రైతు కార్యచరణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పాతపాటి మురళీరామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది అధిక వర్షాల కారణంగా మురుగు కాలువలు పూడుకుపోయి నారుమళ్ల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. మురుగు నీటి పారుదల శాఖాధికారులు మైనర్ డ్రెయిన్స్ మరమ్మతులకు తగు చర్యలు తీసుకుని, ఉపాధిహామి పథకంలోనైనా పనులు పూర్తి చేయాలని మురళీరామరాజు, నాగేశ్వరరావు కోరారు. అలాగే రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డ్రెయిన్స్ మరమ్మతులకు కృషి చేయాలని కోరారు. డ్రెయిన్స్ మరమ్మతుల్లో ఆలస్యం జరిగితే నారుమళ్లు మునిగిపోయి నాట్లు వేయడానికి తీవ్ర జాప్యం కలిగి, పంట నష్టపోతామని వివరించారు. మురుగు నీటిపారుదల అధికారులను సంప్రదించి మైనర్ డ్రెయిన్స్‌లో తూడు, గుర్రపుడెక్క వంటివి తొలగించడానికి కెమికల్స్‌ను పిచికారి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రెయిన్స్ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున కలెక్టర్ సుమిత్‌కుమార్ త్వరితగతిన పనులు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రైతు కార్యాచరణ సమితి నాయకులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కె.కమలాకరశర్మ, ఎం.కృష్ణంరాజు, గొట్టుముక్కల వెంకట భీమరాజు, దండు సత్యనారాయణరాజు, దాసరి సత్యనారాయణ, కోరుకొల్లు మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో జూన్ నెలకు సంబంధించి 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ ఆదివారం తెలిపారు. 3877 మందికి పింఛన్ల సొమ్ము విడుదల కాగా, ఆదివారం నాటికి 3657 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన పింఛన్ల సొమ్ము విడుదల కాగానే అందజేస్తామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప శివారు ఉప్పుటేరు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బత్తిన నాగబాబు ఆదివారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పోలీసుల అదుపులో రౌడీ షీటర్లు

ఉండి: ఓట్ల లెక్కింపును నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాలకు చెందిన ఇద్దరు రౌడీ షీటర్లను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామని ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

రావిపాడు సమస్యను పరిష్కరించాలి

భీమవరం: పెంటపాడు మండలం రావిపాడులోని స్థల వివాద సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆదివారం దళిత సంఘం నాయకులు చింతపల్లి గురుప్రసాద్, భరత్‌కుమార్, బాలకృష్ణ, త్రిమూర్తులు, అశోక్, నాగేశ్వరరావు, రామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితులపై దాడిని ప్రేరేపించిన తాడేపల్లిగూడెం సీఐ రమేష్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రావిపాడులో ఖాళీగా ఉన్న ఇరిగేషన్‌శాఖకు చెందిన స్థలంలో కొంత కాలంగా దళితులు అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించుకుంటూ కమ్యూనిటీ స్థలంగా వాడుకుంటున్నారన్నారు. అగ్రకులస్తుడైన మిలిటరీమేన్ నాగేశ్వరరావుకు ఇంటిస్థలం కేటాయించాలని చేసుకున్న దరఖాస్తుకు వేరే ప్రాంతంలో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే దళితులు వినియోగించుకుంటున్న భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. రావిపాడు వివాదంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజుతోపాటు దళితులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. అక్రమంగా ఇంటి నిర్మాణం చేయిస్తున్న మిలటరీ ఉద్యోగి భార్యకు పోలీసు, రెవెన్యూ అధికారులు మద్దతివ్వడం దారుణమన్నారు. రావిపాడు సంఘటనపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కేసులను తొలగించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో దళితులకు అగ్రవర్ణాలవారు కౌలుకి ఇచ్చిన భూములను తిరిగి తీసుకుంటున్నారని, నిత్యావసర సరుకులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థల వివాద ఘటనపై సీఐడీతో విచారణ జరిపిస్తే నిజాలు బయటికి వస్తాయన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించకపోతే ఈ నెల 6న ఎస్సీ, ఎస్టీ చట్టపరంగా చర్యలకు దిగుతామని హెచ్చరించారు.